బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

- ముందుగా సమగ్ర కులగణన తర్వాతే 'స్థానిక' ఎన్నికలు
- బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ డిమాండ్
- బీసీలను బిచ్చగాళ్లను చేశారు
- బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మండిపాటు

ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

కవాడిగూడ, జూన్ 15: కామారెడ్డిలో కాంగ్రెస్ ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీ మేరకు తక్షణమే సమగ్ర కులగణన చేసి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. లేదంటే బీసీ సంఘాలన్నింటినీ కలుపుకొని రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బీసీ కుల సంఘాల ఐక్య వేదిక, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారాం యాదవ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ ఎత్తివేస్తామని చెప్పి దేశవ్యాప్తంగా ఎక్కువ సీట్లు గెలుచుకున్నారని చెప్పారు. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించకుండానే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కుట్రపన్నుతున్నదన్నారు.

నష్టం చేస్తే ఊరుకోం : ఆర్ కృష్ణయ్య

బీసీ సఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా దేశ పాలకులు బీసీలను బిచ్చగాళ్లను చేశారని, బీసీల ఓట్లతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు నష్టం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాహుల్ గాంధీ మాటను గౌరవించి బీసీ జనాభా ప్రకారం అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

కమిషన్ నివేదికలు బుట్టదాఖలు: ఆర్ఎస్పీ

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ కృషితోనే రాజ్యాంగంలో బీసీ కమిషన్లు వేసుకునే అవకాశం వచ్చిందని, నెహ్రూ నాయకత్వంలో కాకా కలేల్కర్ కమిషన్ నివేదిక, ఇందిర నాయకత్వంలో మండల్ కమిషన్ నివేదికను బుట్టదాఖలు చేశారని గుర్తుచేశారు. మండల్ కమిషన్ అమలు చేసిన వీపీ సింగ్ ప్రభుత్వానికి బీజేపీ ప్రభుత్వం మద్దతు ఉపసంహరించుకోగా రాజీవ్‌గాంధీ వ్యతిరేకించారని చెప్పారు. చట్టాలు, న్యాయ వ్యవస్థను అడ్డుపెట్టుకొని బీసీలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. నేటికీ 79 శాతం న్యాయమూర్తులు ఆధిపత్య వర్గాల వారే ఉన్నారని తెలిపారు. 46, 340 ఆర్టికల్స్ ప్రకారం బీసీల హక్కులను సాధించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, ఆలిండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, మేకల కృష్ణ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణ కుమార్, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్లు, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుటం పురుషోత్తం, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరి గౌరీ శంకర్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ, ఎంబీసీ నాయకుడు కొల్లూరి సత్య నారాయణ, రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, వల్లాల జగన్ గౌడ్, పొన్నం మహేశ్ గౌడ్, న్యాయవాది రాచకొండ ప్రవీణ్ కుమార్, హైకోర్టు న్యాయవాది గుండ్రాతి శారద గౌడ్, అంబాల నారాయణ గౌడ్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం బస్సుయాత్ర

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

హైదరాబాద్, జూన్15 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల మూడోవారంలో బస్సుయాత్ర చేపడుతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న హైదరాబాదులో 'సమగ్ర కులగణన సవాళ్లు-స్వతంత్ర కమిషన్ ఏర్పాటు, బీసీ రిజర్వేషన్ల పెంపు' అన్న అంశంపై బీసీ మేధావులతో బీసీల మేధోమథన సమావేశాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. కులగణన సర్వే కోసం తక్షణమే స్వతంత్ర కమిషన్‌ను నియమించాలని, బీహార్ తరహాలోనే సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎం, బీసీ సంక్షేమశాఖ మంత్రి తక్షణమే జోక్యం చేసుకొని జాప్యం లేకుండా బీసీ కులగణన చేపట్టేలా చర్యలు చేపట్టి, తమ హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

హైదరాబాద్‌లోని ఓ టీస్టాల్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

సర్కారుపై నిరుద్యోగుల ఉద్యమం

- గ్రూప్-1 సమస్యల పరిష్కారం కోసం పోరాటం
- న్యాయం కోసం సెక్రటేరియట్ ముట్టడికి పిలుపు
- అడ్డుకున్న పోలీసులు.. బక్క జడ్సన్ హౌజ్ అరెస్ట్

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని తెలంగాణ నిరుద్యోగ యువత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఉద్యమంలో భాగంగా బక్క జడ్సన్ ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడించాలని పిలుపునివ్వగా, శనివారం సచివాలయం గేట్ వద్ద ధర్నా చేయాలని నిరుద్యోగులు నిర్ణయించారు. దీంతో బక్క జడ్సన్‌ను పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు.

రిజర్వేషన్లలో కాంగ్రెస్ సర్కారు అన్యాయం

గ్రూప్-1 ఉద్యోగాల భర్తీలో కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరి వల్ల తమకు అన్యాయం జరుగుతున్నదని నిరుద్యోగులు చెప్తున్నారు. గ్రూప్-1 మెయిన్ పరీక్షలకు 1:50 నిష్పత్తికి బదులుగా, 1:100 ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రూప్-2లో 2,000 పోస్టులు, గ్రూప్-3లో 3,000 పోస్టులు పెంచడానికి గతంలో హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఈ విషయంలో ఎందుకు నోరు మెదపటం లేదని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్రూప్-1 కొత్త నోటిఫికేషన్‌లో రిజర్వేషన్ అమలు నిబంధన తొలగించారని వెల్లడించారు.

ప్లకార్డుల ప్రదర్శనలు

ఉద్యోగాల భర్తీ విషయంలో తమకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసేంత వరకు ఉద్యమం ఆపబోమని నిరుద్యోగులు స్పష్టం చేస్తున్నారు. ప్లకార్డులతో హైదరాబాద్‌లోని పలు ప్రదేశాల్లో పోరాటానికి దిగారు. న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారంపై సీఎం రేవంత్ దృష్టి పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉస్మానియా యూనివర్సిటీలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

'రెగ్యులర్ వీసీలను నియమించాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 15: రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు తక్షణమే రెగ్యులర్ వీసీలను నియమించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉస్మానియా యూనివర్సిటీలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ ఈ నెల 15 కంటే ముందుగానే వీసీలను నియమించి, వర్సిటీల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పిన ప్రభుత్వం మాటతప్పిందని ధ్వజమెత్తారు. ఇన్‌చార్జి వీసీల తోనే పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. వీసీల నియామకానికి ఏర్పాటుచేసిన సెర్చ్ కమిటీలు ఇప్పటివరకు ఒక్కసారి కూడా సమావేశం కాలేదంటేనే ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి తేటతెల్లమవుతుందని దుయ్యబట్టారు. తక్షణమే వీసీలను నియమించకపోతే దశలవారీగా ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. వర్సిటీలలో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. నాయకులు నరేశ్, అశ్వన్, రాఘవేందర్, రమేశ్, సంతోష్, వరుణ్ పాల్గొన్నారు.

18 వేల వేతనం అమలు చేయాలి

- బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్
- డీఎంహెచ్ఎస్ కార్యాలయం ఎదుట ఆశాల ధర్నా

కోఠిలోని డీఎంహెచ్ఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

సుల్తాన్‌బజార్, జూన్ 15: రాష్ట్రంలోని ఆశ వర్కర్లకు రూ.18 వేల చొప్పున వేతనాన్ని అమలు చేయాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ కోఠిలోని డీఎంహెచ్ఎస్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల (ఆశ) సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీన ఆశ వర్కర్లకు ప్రభుత్వమే వేతనాలు ఇవ్వాలని, కాంగ్రెస్ మ్యానిఫెస్టో హామీ మేరకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ఆశలకు ఏఎన్ఎం, జీఎన్ఎం ఉద్యోగాల్లో ఆవకాశం కల్పించాలని, ప్రమాదం జరిగినా, సహజ మరణం పొందినా ఎక్స్‌గ్రేషియా అందజేయాలని, హెల్త్‌కార్డుతో కూడిన జాబ్‌చార్ట్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ధర్నాలో పాల్గొన్న ఆశ కార్యకర్తలు ఒక్కసారిగా డీఎంఈ వైపు దూసుకెళ్లడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు వారిని అడ్డుకొని సముదాయించారు. అనంతరం కుటుంబ వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయంలోని హెల్త్ న్యూట్రిషన్ జేడీ పద్మజకు వినతి పత్రాన్ని అందజేశారు. కనీస వేతనాల మాజీ చైర్మన్ నారాయణ, బీఆర్‌టీయూ కార్యదర్శి మారయ్య, రూప్ సింగ్, తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్ సంతోషి, ప్రధాన కార్యదర్శి కరుణ, సభ్యులు లక్ష్మి, రేణుక, విజయ, అనిత, రాణి, అపర్ణ, సమతా, పుణ్యవతి, రేణుక, మంజుల, స్వరూప, రబియా, యాదమ్మ, మాధవరెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్1 ఎంత మంది రాశారో చెప్పండి?

- దళిత, మైనారిటీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 15: గ్రూప్ 1 పరీక్షకు ఎంతమంది హాజరయ్యారో తేల్చి చెప్పాలని దళిత, మైనారిటీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీజీపీఎస్సీ ఇటీవల నిర్వహించిన గ్రూప్1 పరీక్షలో పారదర్శకత లోపించిందని ఆరోపిస్తూ ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ ఈ పరీక్షపై అనేక అనుమానాలు ఉన్నాయని, వారం గడుస్తున్నా అభ్యర్థుల సంఖ్యను చెప్పకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సంఖ్యలోనూ స్పష్టత లేదని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సమీర్, శేఖర్, రాణా తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం కరీంనగర్ జిల్లా శాఖ ప్రతినిధులు

గొర్రెల పథకంపై స్పష్టమైన ప్రకటన చేయాలి

- కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట టీజీఎంపీవీఎస్ ధర్నా

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 15 : బీఆర్ఎస్ సర్కార్ ప్రారంభించిన గొర్రెల పంపిణీ పథకం కొనసాగింపుపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం కరీంనగర్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గొల్లకుర్మలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నినదిస్తూ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా కరీంనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు సందెబోయిన ప్రసాద్‌యాదవ్ మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గొల్ల కుర్మల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రెండో దఫా గొర్రెల పంపిణీ పథకం కోసం డీడీలు చెల్లించిన వారికి తమ ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చేస్తుందని ఎన్నికలకు ముందు ప్రకటించిన కాంగ్రెస్, గెలిచిన తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. గొర్రెలు, మేకల పెంపకం ప్రాథమిక సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మటన్ ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సత్వరమే స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ పట్టణ అధ్యక్షుడు జంగ కొమురయ్య, నాయకులు గాదం శ్రీనివాస్, రాధారపు కుమార్ పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములు ఇవ్వం

- రైతులతో భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా సమీక్ష
- భూములు ఇచ్చేది లేదని తెగేసి చెప్పిన అన్నదాతలు
- 'హైవే' సర్వే వద్దంటూ వైరా రోడ్డుపై రైతుల ఆందోళన

కలెక్టర్ ముందు బ్యానర్లు పట్టుకొని నిరసన తెలుపుతున్న రైతులు

భూపాలపల్లి రూరల్/రఘునాథపాలెం, జూన్ 15: భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు నష్ట పరిహారం అందజేస్తామని జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూ సేకరణపై టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అభివృద్ధికి రహదారుల ఏర్పాటు అత్యంత అవసరమని, భూ సేకరణ విషయంలో రైతుల సూచనలు, సలహాలు తీసుకొని నివేదికలు పంపామని తెలిపారు. 350 ఎకరాల్లో 35 కిలోమీటర్ల దూరం వరకు గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే వస్తుందని, రోడ్డు నిర్మాణం కోసం 45 మీటర్ల వెడల్పుతో భూసేకరణ చేయాల్సి ఉందని చెప్పారు. ఈ సందర్భంగా రైతులు స్పందిస్తూ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేకు తమ భూములు ఇచ్చేది లేదని తెగేసి చెప్పారు. తమకు భూములే జీవనాధారమని, తమను ఇబ్బంది పెట్టొద్దని కలెక్టర్ ముందు బ్యానర్లు పట్టుకొని నిరసన తెలిపారు. రైతుల నిరసనతో కలెక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం భూపాలపల్లి-పరకాల రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. ప్రధాని మోదీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లో హైవేకు భూములిచ్చేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, మూడు మండలాల రైతులు పాల్గొన్నారు. కాగా.. ఖమ్మం జిల్లా వీ వెంకటాయపాలెం రెవెన్యూ పరిధిలో నాగ్‌పూర్ టు అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం రెవెన్యూ అధికారులు పోలీసు పహరా నడుమ శనివారం తెల్లవారుజామున 5 గంటలకు భూ సర్వే చేపట్టారు. భూములు కోల్పోతున్న రైతులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే అధికారులు మూడు బృందాలుగా పోలీసులతో ప్రత్యక్షమయ్యారు. విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి రావడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో రైతులు వైరా రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో రైతులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు పలువురు రైతులను అరెస్ట్ చేసి రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రైతులతో సంబంధం లేకుండా సర్వే చేస్తున్న నేషనల్ హైవే అథారిటీ అధికారుల తీరును సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నవీన్‌రెడ్డి తప్పుపట్టారు.

బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు

బీజేపీ ఆఫీస్ ఎదుట ఎన్ఎస్‌యూఐ ధర్నా

హైదరాబాద్, జూన్15 (నమస్తే తెలంగాణ): మెడికల్ అడ్మిషన్ల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు శనివారం మెరుపు ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న బీజేపీ నేతలు భారీగా అక్కడికి చేరుకొని ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ బీజేపీ కార్యకర్తలు నినాదాలకు దిగారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేసి అక్కడి నుంచి తరలించారు.

ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్‌లో అక్రమాలు

- ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల అమలులో అవకతవకలు
- ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి విచారణ చేయాలి
- ఆర్ కృష్ణయ్య డిమాండ్.. వైద్యారోగ్యశాఖ మంత్రికి వినతి

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల అమలులో అక్రమాలు, అవకతవకలు జరిగాయని, జీవో 550ని సక్రమంగా అమలు చేయటం లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య విమర్శించారు. దీనిపై ప్రభుత్వం వెంటనే ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. జీవో 550 ప్రకారం ఎక్కువ మార్కులు ఉండి ఓపెన్ కాంపిటీషన్‌లో వచ్చే అభ్యర్థులను రిజర్వేషన్ కింద లెక్కించవద్దని, ఓపెన్ కాంపిటీషన్‌లో వచ్చిన అభ్యర్థి కాలేజీ ఆప్షన్ మార్చుకొని ఇంకొక కాలేజీకి వెళితే ఖాళీఅయిన ఆ సీటును అదే కాటగిరీకి చెందిన అభ్యర్థికి ఇవ్వాలని తెలిపారు. గత 19 ఏండ్లుగా దాని ప్రకారమే అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగిందని, ప్రస్తుతం హెల్త్ యూనివర్సిటీ అధికారులు దానికి తూట్లు పొడుతున్నారని ధ్వజమెత్తారు. జీవోను సక్రమంగా అమలు చేయకపోవటం వల్ల 262 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎంబీబీఎస్ సీట్లు దక్కకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ యూనివర్సిటీ మెట్రిక్స్ అమర్చిన విధానం లోపభూయిష్టంగా ఉన్నదని ఆరోపించారు. ఇప్పటికైనా జీవో 550 యథాతథంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో గుజ్జ కృష్ణ రాజేందర్, నందగోపాల్, భూపేశ్‌సాగర్, రాజ్‌కుమార్, రఘుపతి, పర్వతాలు, బలరాం, నిఖిల్ పటేల్ తదితరులు ఉన్నారు.

కామారెడ్డి జిల్లా చిన్న మల్లారెడ్డిలోని సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న తిమ్మక్‌పల్లి రైతులు

నారు ఎండుతున్నా కరెంటు ఇవ్వరా?

- డీడీలు కట్టి మూడు నెలలైనా ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తలేరు
- కాంగ్రెస్ వచ్చాకే కష్టాలు
- విద్యుత్తు కోసం మెదక్-కామారెడ్డి రోడ్డుపై రైతుల ధర్నా

కామారెడ్డి, జూన్ 15: విద్యుత్తు లేక వరి నార్లు ఎండిపోతున్నాయని, వెంటనే కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డెక్కారు. డీడీలు కట్టి మూడు నెలలవుతున్నా ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వడం లేదని అధికారులపై మండిపడ్డారు. ఈ మేరకు శనివారం కామారెడ్డి జిల్లా చిన్నమల్లారెడ్డి విద్యుత్తు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. దీంతో కామారెడ్డి-మెదక్ ప్రధాన రహదారిపై రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లికి చెందిన రైతులు వ్యవసాయ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు కట్టారు. మూడు నెలలవుతున్నా అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గద్దెలు కట్టారు తప్పితే ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. వర్షాలు పడితే పొలాల్లోస్తంభాలు వేయరాదని, గ్రామంలోనూ కరెంట్ సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. కరెంట్ లేక వరి నార్లు ఎండిపోయే పరిస్థితి ఉందని చెప్పారు. ఏ అధికారి వద్దకు వెళ్లినా సరైన సమాధానం చెప్పడం లేదని రైతులు మండిపడ్డారు. విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం కారణంగా చాలా మంది రైతులు ఇంకా నార్లు పోయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచే రైతులకు కష్టాలు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుల ధర్నాతో మెదక్-కామారెడ్డి ప్రధాన రహదారిపై సుమారు రెండు గంటలకుపైగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడకు చేరుకుని సముదాయించడంతో రైతులు ధర్నా విరమించారు.

రుణమాఫీ చేయాలని ధర్నా

- నిర్మల్ కలెక్టరేట్ ఎదుట నిరసన
- సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపాటు

నిర్మల్, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సర్కార్ తమ సమస్యలను పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళనకు దిగారు. శనివారం అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) ఆధ్వర్యంలో నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. దాదాపు గంటపాటు కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద నిరసన తెలిపిన రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు, రైతులు మాట్లాడుతూ.. సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతులకు తీరని అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రైతులకు సంబంధించి ఒక్క రుణమాఫీ మాత్రమే ఉన్నదని, దానిని ఏకకాలంలో మాఫీ చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వంలో అనధికార కరెంటు కోతలు మొదలయ్యాయని, కోతలు లేని నాణ్యమైన కరెంటు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే రైతుబంధు నిధులు విడుదల చేయాలని, పంటల బీమా పథకాన్ని అమలు చేసి పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు. లేకుంటే రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఏఐపీకేఎస్ జిల్లా అధ్యక్షుడు నంది రామయ్య, రైతులు పాల్గొన్నారు.

నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతు సంఘాల నాయకులు, రైతులు